మనీపర్సు మహాత్మ్యం

శ్రీమతి కె. కాత్యాయనీదేవిగారు

చెన్నపట్నమందలి బజారులలో చైనాబజారు నాయకమణివంటిది. ఆ వీధికి వచ్చుపోవు జనము సుమారు రాత్రి 8, 9 గంటలవరకు బహుసమర్దమై తెల్లని యావిద్యుత్కాంతులయందు నల్లని వారి శిరస్సులం జూడ తిలతండులన్యాయముగా గన్పట్టుచుండు. ఆ బజారునందు వివిధరకముల వస్తుసముదాయమేగాక సుగంధద్రవ్యాదులు, వస్త్రములు చౌకగా విక్రయించబడునని వదంతి. ఆ వదంతి వాస్తవమెరుంగగోరి తత్ శృంగారవీక్షణాయత్తచిత్తలై వచ్చిన మత్తకాశినుల యాభరణాదులపై వచ్చుటనున్న విద్యుత్కాంతులు ప్రసరించి ఆవాడ శృంగారమునకు వన్నెదెచ్చుచుండెను. అత్యవసరముగా వస్తుసముదాయము గూర్చవలసినదిగా జనకునాజ్ఞ కాగా శిరసావహించి బజారునకొచ్చితి. నేనా బాజారు వీక్షించ, ప్రకృతికాంత సన్నాహ్వానించుచున్నదో యనునట్లుండె. నేను వస్త్రములు మినహా మిగిలినవన్నియుగొని ఖాదీభాండారముదెస బోదలంచునంత అడయూరునుంచి వచ్చినకారు నావెనుక శబ్దమివ్వ తిరిగి చూచితిని.

చూచుచుండగనే సుమారు 18, 19 సంవత్సరముల నవయౌవని మేఘములనుండి వెలుపడిన చంద్రబింబముతో దీటైన ముగముగలిగి విద్యుల్లతవోలె బస్‌దిగి వస్త్రాలయాభిముఖియై బోదొడంగె. ఆమె లేగులాబి చీరధరించి యదేరంగుగల ముఖమల్ చెమికీఫ్రూల రవిక తొడిగికొనెను. ఆమె ధరించిన వస్త్రములు రంగుకు ఆమె చెక్కిళ్ళు రంగుతీసి పోకుండె. రంచియందే దోషమున్నగాని రాణించదనుటకు యామె ధరించిన నల్లని పెద్దయద్దముల కండ్లజోడు అదే రంగుగల జపానుబూట్సులే సాక్షి. త్వరితగమనయై వస్త్రాలయప్రవేశముజేసి కావలసిన వస్త్రములుగొని చేసంచినుండి మనీపర్సుతీసి వారికి పైకమిచ్చునంత నావిక్రేత కొత్తరకములు చూపనవి చూడదలంచి ఆ పర్సు వస్త్రములచ్చటబెట్టి చూచుచుండ 8 గంటలు యెదర గడియారము గొట్ట వస్త్రములుమాత్రము గైకొని మనీపర్సు మరచిపోయి పోయెను.

పోవునపు డామె వదులైన కోడెత్రాచువంటి జడ ఛాతిపైబడ నామె సర్దుకొనుచుండ మరలయచ్చటనే పడుటచూడ నిజముగా పామేమైన పగబట్టినదాయని చూపరులు భ్రమపడునట్లుండె. నే నామె సౌందర్యామృతము గ్రోలుచూ మైమరచియుంటి. ఆ వస్త్రాలయ యజమానికే కాక నాకు స్పృహ గల్గింప వారి కుడుపు చెల్లించినటు జూడ నా బల్లపై యామె పర్సుండె. ఆవస్త్రాలయాధికారి కదియంద జేయబోవ నన్నాపె కందజేయమనియూ ఆమె ఆబస్ వద్ద నవసరపడుచున్నదని చెప్పి నన్ను నాపెవద్దకు పర్సుతోగూడ బంపె.

౨

బస్ వుండుచోట నామెలేదు. కలయజూడ ముందుపోవుబస్‌లో నామెవస్త్రమగుపడ నదియాత్రగాగొని యచటికిబోవునంత నది సాగె. అతికష్టముపై నా బస్ నాపి నామెనుద్దేశించి "మీవస్తువులన్నియూ మీవద్దనున్నవా" యనునంత నన్నాపాదమస్తకము నిముషములో తీక్షణముగా పరిశీలించి తనవస్తువులు జూచుకొని నన్నుద్దేశించి "నాపర్సుపోయిన"దని కళవళపడుచూ దీనవదనయై పలికె.

నే :—యెచ్చటపోయినది?

ఆమె:—......షాపులో మరచినగుర్తు.

నే:—నిజము. ఇదిగో గ్రహించుడని నేనివ్వ నామె గైకొనుచూ చూపి వెంటనే మరుగుపరచిన భావముంజూడ మనోజ్ఞములై దొంతర దొంతరలుగావచ్చి వొడ్డుకుతగిలి సమసిపోవుతరంగముల భాతినుండె.

ఆమె:—తమ విశాలహృదయముతో నాకిచ్చినందులకు కృతజ్ఞురాల. ఇదియే మరియొకరు చేయజాలరు. చేసంచిలో! పరును పెట్టితినని భ్రమచే తను బస్ వుండదనెడి యాదుర్దాలో చూచుకొనక షాపునుండి వచ్చితి. శ్రమయిచ్చినందులకు

క్షమార్హురాల. తమవిలాసమిచ్చెదరా మరల దర్శించెదనని నే విలాసమివ్వ బస్ కదిలిపోయె. కనుచూపందువరకు బస్‌చూచి గృహాభిముఖుడనైతి. భోజనానంతరం శయనించనేగితి.

పడుకొంటినేగాని నిద్రపట్టలేదు. ఆ నారీమణి వాక్కులే నాకర్ణముల ప్రతిధ్వనించుచుండ యెటుల నిద్రపట్టునో? అయ్యో! యింక రెండు మూడు మాటలైన మాట్లాడించక పోయితినే? అహా! యేమి ఆవాక్కుల మృదుత్వ, వినయ, విధేయతలు. పంచమ స్వరములో లీనమై కోకిలా స్వరమునుకూడ ధిక్కరించుచూ మనోజ్ఞముగా నుండెగా! అమృతము చిలుకునట్లున్నదే! పెక్కుగ మాటాడిన యాణిముత్తెములు రాలునని కాబోలు మాటాడ మొహమాటపడినది. అదానిమ్మగింజలవంటి పలువరుసలో నవ్వులుచూడ వికసించిన మల్లెలవలె నుండెనే—ఆ లోలక్కుల తళుకుబెళుకులు—కోటేరువంటి నాశిక—ఆ ఆకర్ణాంతనయనములు—దానిపైని నల్లని కండ్లజోడు—దొండపండును ధిక్కరించు యధరము—లేగులాబి రంగుగల చెక్కిళ్లు—శంఖమువంటి మెడ—చెక్కుటద్దమునుంబోలి నునుపైన ఫాలమూ—మరతునన్ననూ మరపురావు గదా యని యామె హొయ, భావములం దలంచుచూ నిద్రాదేవికి వశుడనగునప్పటికి 3 గంటలైనట్లు గుర్తు.

3

మరుదిన మామెవచ్చి తనకృతజ్ఞత తెల్పించెను. అపుడపుడూ మేము బజారునందు కలసినప్పుడు క్షేమసమాచారము ఎరింగెడివారము కొన్నిదినములు సముద్రతీరమందు కొలదిగ కలసి విడిపోయెడివారము పరిచయ మెక్కువ లేమిచే. క్రమక్రమముగా మా పరిచయము వృద్ధికాదొడంగె. సంభాషణ నిమిత్తార్థమై నే ప్రత్యేకముగా కలసెడివాడ నా సముద్రతీరమందలి సైకతస్థలముల నామెను. మా పరిచయము క్రమముగ మైత్రియై స్నేహములో మారి వుభయులకు తీరికగా యున్నప్పుడు నే నచ్చటికి పోవుటో యామె నావద్దకువచ్చుటో జరిగెడివి కొన్నిరోజులు. కతిపయ దివసానంతరం మా వుభయుల స్నేహలత ప్రణయలతగా మారి ఒకరికొరుక లేక ఒకరి హృదయమున నల్లుకొని వస్థాన మేర్పరుచుకొనె. ఆ ప్రణయబీజము మొలచినతదుపరి వృక్షమై, పూలుపూచి, కాయలుకాచి, పండ్లుపండు టెన్నడో నే ననుభవించు టెన్నడో దైవమున కెరుక. నేనాఫలము కొరకై యాతురతగా యున్ననూ పైకి గంభీరముగా యుంటిని కాని యామె చైదములుచూచి యిదమిద్ధమని నిర్ణయించ జాలకుంటిని. ఆమెకూడ చదువునది వైద్యవిద్య గనుక నదురు బెదరులేక స్వేచ్ఛగా సంచరించుటయం దాంగ్లయువతులకు తీసిపోక హిందూ యువతుల కాశ్చర్యము గల్పించుచుండె. ఆమె తరచు స్త్రీ స్వాతంత్ర్యమునుగూర్చి ముఖ్యముగా బాల్యవివాహాదులగూర్చి సంఘదురాచారములగూర్చి నాతో చర్చించెడిది. నాకు జూడ తెలుగు నందుకన్న యాంగ్లమున నే యామెకు పరిచయ మధికమని యామె చమత్కార యాంగ్లసంభాషణయే చెప్పుచుండె. యేదైన విషయము చర్చించునప్పుడు దానిని సంఘలోపముగామార్చి తనప్రజ్ఞ చూపెడిది. నన్నుకూడ సంఘమును సంస్కరించుటలో తనకు సాయపడ గోరెడిది. ప్రథమమందు నే నామెకు ఈ విషయమున విరుద్ధముగా యున్నా ఆమెదీనులగు అనాథలు పడు అవస్థలు, కడగండ్లు నాకు కంటిమొదట యామెమాటచే చూపి నన్ను తనవశ్యునిజేసికొనె. ఆమె యుక్తియుక్తముగ, సహేతుకముగా నాయభిప్రాయముల ఖండించినందున నే నామెకు సాయము జేయ స్థిరసంకల్పుడనైతి. అనాథలసేవయే భగవత్ సేవగాతోచె. ఆరోజుమొదలు మే ముభయులమూ, సంఘసంస్కర్తలను పిలపించి సభలుచేయించియూ ఉపన్యాసములిచ్చియూ కార్యరంగప్రవేశ మొనర్చితిమి. అంతటితో నూరుకొనక స్వీయాచరణచేసిన గాని యితరులకు మామాటయందు గౌరవముండదని తలచి నా యభిప్రాయమును హృదయపీఠముల పెట్టి పూజించుచూ సమయముకై నిరీక్షించుచుంటిమి. కాని మాసేవ భగవంతునకిష్టమో అయిష్టమో! నా దేవదేవునిలీల లనంతములు గదా?

౪

అవి క్రిష్టమస్ రోజులు. ఒకరోజు కమల నా నివాసమునకు పగలు రెండుగంటలకొచ్చెను. చూడ చాల యలసినట్లు గనుపించుచుండె.

నే:—శ్రమపడి యెండలలోవచ్చితిరే? మంచినీరు కావలెనా? ఈ కుర్చీలో గూర్చొనుడు.

కమల:—మోహన్, క్రొత్తవారివలె నన్ను పరామర్శ చేసెదవేమి? యనుచూ నామె కుర్చీలోకూర్చుని యెదరనున్న నిలువుటద్దమునం జూచుకొనుచూ చెదరిన ముంగురుల సరిజేసుకొనుచూ ముఖకమలమున ముత్యములవలెనున్న శ్వేదబిందువుల తన శిల్కు చే రుమాలుచే తుడుచుకొనుచుండె.

నే:—అలసినట్లున్నది. ముందు మొగము నాకొళాయి వద్ద కడుక్కొనిరాకోరెద. కొద్ది ఫలహారముచేయకోరెదనన ఫలహారమొద్దని యామె కొళాయివద్దకేగి ముఖముకడిగి యద్దమున చెదరిన ముంగురుల సంస్కరింపుచుండె. నా ప్రతిబింబ మద్దమున కనబడునన్నమాటగూడ మరచి యద్దమందలి యామె ప్రతిబింబమును చూచుచూ "యెంత సౌందర్యము" అని అప్రయత్నముగా నంటినో లేదో ముక్కుపైకి ప్రేలొచ్చి తన విధ్యుక్తధర్మముం దీర్చె, అవ్విధముగా యెంతసేపుంటినో గాని యామెపిలుపు నాకు స్పృహాగల్గించె.

కమల:—ఈరోజు పార్కునందు ప్రపంచవిఖ్యాత ముష్టియుద్ధసార్వభౌముడగు గన్ బోట్ జాక్ గారి ముష్టియుద్ధమట, అందులకై మిమ్ముల శ్రమపెట్టదలంచినందులకు క్షమించుడు. నా ఈస్వల్ప ప్రార్థన నిరాకరించరనెడి ధైర్యముచే యెండగూడ లక్ష్యముజేయక తమ సాన్నిధ్యమునకొచ్చితి. సాహసమునకు మన్నించకోరెద.

నే:—నేనూ అదే ప్రయత్నములోనుంటి, మీరు యింక $\frac{1}{4}$ గంటయాలశ్యముగా వచ్చియుండిన నే మిమ్ముల గలసెడివాడగాను యనుచూ పోయి దుస్తులు ధరించిరా మేముభయులమూ పార్కుకు పోతిమి.

అచ్చట ననేక రకముల ఆటలు, గుఱ్ఱపుపందెములు, లాటరీలు, ప్రదర్శనశాలలు, నాటకశాలలు, బూటకశాలలు విపరీతముగా లెక్కకుమించియుండె. వీటి నన్నిటిదాటి ముష్టియుద్ధప్రదేశమునకేగితిమి. ప్రథమమున రెండు జోడులు పోట్లాడిరి. తదుపరి ఆకలిగొన్నసింహములవలె అసలు జోడా యుద్ధరంగప్రవేశము జేరి పోట్లాట ప్రారంభించిరి. సుమారు 5 నిముసములు గడచెనో లేదో ఒక పెద్ద జనప్రవాహము కటకటాలు విరుగద్రొక్కుకొచ్చుటచూచి మేమాసెజూడ నచ్చట యగ్నిప్రమాదముచే వేయబడిన పాకలంటుకొని మంటలు మాదెసరాదొడంగునంత అతికష్టముపై నాజనసమూహమునుండి వెలువడి వడిగా నడచి జంతుప్రదర్శనశాలవద్దనున్న నదీతీరముం జేరితిమి. ఆనదియందున్న నొకనోనెపడవం జూపుచూ

ఆమె:—"దీనిని మీరు నడుపగలరా"?

నే:—నాకభ్యాసము తరుగు.

క:—నే బాగుగా నడుపగల. ప్రతి శని యాదివారములందు నేను నా స్నేహితురాలగు మేరీతో వచ్చి దీనిపై విహారించెడిదాన. అప్పుడు నే నేర్చుకొంటిననుచుండ నే పరధ్యానములోనుంటి. ఆమె శరవేగమునబోయి టిక్కట్టుకొని మరమరాలుతెచ్చి నానావయందాశీనుడనగుమన నాసీనుడనైతి. ఆమె నాయానపాత్రము నతినిపుణతతో నడుపుచుండ నే విలాసముగా నామెవైపూ ప్రకృతికాంతవైపూ జూచుచూ వీరిలోయెవరందకత్తెలో తేల్చ ప్రయత్నించుచుంటి. అప్పుడె సాయింత్ర మైదుగంటలాయె. ఆయేటియందు విహరించు బాతులు మాయొద్ద కెరకై వచ్చె నా సాయంసమయమున. మలయమారుతమల్లనల్లన వీవదొడంగె. సాయింత్రమగుటచే జలపుష్పములభాతి మత్స్యములు పైకెగురుచూ మరల పడుచూ నీటిపై వినోదించుచుండె. మేమువేయు యెఱకై ఆమత్స్యములూ బాతులూ పోరాడుకొనుచుండుట చూడ మాకు నేత్రానందముగానుండె. నీటిలోని నాచు మానావచే గలిగిన కదిలికచే పైకి క్రిందికి వుయ్యాలలూగుచుండుట చూడ నది మాతో దాగుడుమూతలాడుచున్నట్లుండె. సంధ్యారాగము ఆమె మొగముపైబడి

తనకు మించిన సౌందర్యవతిగా గ్రహించె ప్రాచీ దిశాంగన. ఆమెపై క్రోధమువహించెనో యనునట్లు పశ్చిమదిక్కెఱ్ఱబారె. ఎచ్చటచూచినను బంగారురంగు లీన ప్రకృతికాంత శోభాయమానముగా వెలుంగజొచ్చె. అదేసమయమున బాతుల జంట యొకటి ఆమెవేయు యెఱ్ఱయైన గ్రహించక సరస సల్లాపములాడుచూ మైమరచి నిజ ప్రేమతత్వము వెల్లడించుచుండె. ఆమె నాటిని జూచుచూ మరల నావంక జూచుచూ వేడి నిట్టూర్పుల నిగుడించుచుండె. ఆ వేడినిగుర్పుల వేడిగాలి సోకినమీద ఆమె నా వైపూ యీ జంటవైపు చూచి చిరునవ్వు పెదవులయందే యణచుకొనె.

నే:—నవ్వేదరేల?

కమల:—తమకన్న చిన్నదాన్ని స్నేహితురాలుగాన నన్ను యింతటినుంచి పరాయివారిల గౌరవించినట్లు మీరు గౌరవింపవలదని ప్రార్థన.

నే.—అలవాటు. ఏదో పెద్దలనెడు రాయుక్షణమాని పట్టింపా?

క:—నే గోరెడి దదియే.

నే:—అదియా కారణము

క:—(మౌనం)

నే:—నీ మనస్సుకు కష్టముగల్గించునదైన—రహస్యమైన—యిష్టములేనిదైన

క:—రహస్యమేమున్నదీ. ప్రస్తుత మన స్థితిచూచి, రేపు నేవుండుస్థితి తలంపుకురా, మనకు సద్దు యింతలో మరల మనకు సమాగమముకల్గునో లేదో యని కష్టముతో చిన్నీ......

నే:—తో చిన్నీ......పై విషయము చెప్పెదవా?

క:—నిస్సందేహముగా. నాకు 5-వ యేటనో 8-వ యేటనో గుర్తులేదు కాని వివాహమయ్యె. నాతండ్రి ధనాశాపీడితుడై భాగ్యవంతుడగు నొక వృద్ధునకు నన్ను బాల్యవివాహమునకిచ్చె. కనీసం వత్సరమైన తిరగకుండ నా భర్తయూ తండ్రియూ గతించిరి. అనకూడదుకాని నాకు విధవత్వం ఆవిధంగా కలిగినది. నేచిన్ననాటినుంచియు విద్యయందు దాసక్తిగలదాన నగుటచే ప్రతి తరగతియందునూ ప్రథమురాలుగ నుత్తీర్ణురాలనయ్యెడిదాన. నావిద్యల కలరు ప్రభుత్వము వారు సాయముచేయ వైద్యవిద్యకై వారి యుపకారవేతనముపై వచ్చి చదువుచుంటి. పూర్వాచార సంపరాయణుడూ, లుబ్ధాగ్రేసర చక్రవర్తి అసూయాదేవతాస్వరూపుడగు నా పినతండ్రికి గత్యంతరములేక నాతో పట్నము వచ్చె. అతనికి నావైఖరి యింద దనుమానముతోచ నన్నుయవమాన పరచె. ఆగోటే ప్రమాదవశమున ట్రాముచే త్రొక్కబడి మరణించె. ఆయన మరణింపక పూర్వమే నాపునర్వివాహ విషయము ప్రస్తావింప నా తాండవభూతావతారమగు నతడు నన్ననరాని మాటలాడిన స్నుకాదకివుంచినట్టుగా జ్ఞప్తి.

నే:—షుమారు 2 నెలల క్రితం సెంట్రల్ స్టేషన్ వద్ద చనిపోయిన రామస్వామయ్యరా?

కమల:—అవును. చాలా చిక్కులుపెట్టి చనిపోయినాడు. రేపు బెంగుళూరుపోయి కొన్ని అత్యవసరకార్యభాగములు సరిచేసుకోవలయు. యిక నింతలో తమదర్శనభాగ్యము లభింపమికి చింతగానుంటి.

నే:—నీకంత యభిమానమున్న వచ్చిపోగూడదా?

క:—పరిస్థితులు క్లిష్టముగాయున్నందున దుర్లభమని తలచెద.

నే:—సరే. త్రికరణశుద్ధిగ వివాహమాడ దలంచితిరా?

క:—ఆ! ఈ భూదేవి, యీయాకాశవాణి, మనక్రింద నున్న జలదేవతా సాక్షిగా.

నే:—సరియె! సంఘము నెదుర్కొనెదరా? కష్టసుఖము లాలోచించితిరా? మాటలచే గాక క్రియాచరణచేయుట ఉత్తమలక్షణము. సంతోషముకాని సం.........

క:—యిక సంఘాన్ని గురించా! ఈసంఘం—స్వార్థపరుల సంఘం—పాపులసంఘం—హద్దులేని నిరంకుశసంఘం—భుక్తికికూడు కాకిసంఘం—మూర్ఖ

లగు ఛాందసుల సంఘం—దౌర్భాగ్యసంఘం—నే పసిదానినై యుండగా నా కుతికె కోసిన సంఘం.........

నే:—సరియే......కాని......

క:—యింక నాపాతివ్రత్యాన్ని గురించా? మాపాప సాక్షిగా, త్రిమూర్తుల సాక్షిగా నేను పాతివ్రత్యానికి భంగం గాచరించలేదు.

చదివెడిది వైద్యవిద్య గనుక దాని కనుగుణముగు వేషభాషల నుండవలసివచ్చె.

నే:—ఇంతలో బెంగుళూరునుంచి రావా?

క:—ఇక వివాహమునకే వచ్చుట.

నే:—ఎవరి వివాహము?

క:—నాదే?

నే:—(ఆశ్చర్యముగా) నీదా? ఎప్పుడు?

క:—సుమా రారుమాసములపైన.

నే:—సంబంధము?

క:—ఏవ్యక్తి యువకసంఘసంస్కర్తలయం దగ్రగణ్యుడని పట్నమునందు నుతించబడుచుండెనో—యేవ్యక్తి నాధారముగాగొని నేనుఘనసంస్కరణ ప్రారంభించితినో—యేవ్యక్తి తన సౌందర్యముచేతనూ వినయవిధేయతాది సద్గుణములచే నా మానసము చూరగొనెనో—ఆవ్యక్తి నాప్రత్యక్ష దైవాన్ని పరిసుచే గూర్చబడిన సంబంధాన్ని.

నే:—(సంభ్రమాశ్చర్యములుప్పతిల్ల) నిజమే! ధన్యుడననుచూ నామెం గాఢాలింగన మొనర్చి అధర సుధారసాస్వాదనచే మైమఱచి సుఖాంబుధి నోలలాడితి. ఆమెయు నాప్రణయ సామ్రాజ్యమందు పట్టమహిషియై గాఢాలింగనమొనర్చుచూ అర్ధముకుళితనయనయై నాముఖకమలము వీక్షించుచూ మైమఱచె. ఆ సుఖమున నెంతకాలముంటిమో మాకే తెలియదు. మమ్ముల చూచి యోర్వలేనిదై నిశాకాంత తన చెలియగు చక్రవాకిచే గూయింప నాబాల తెలివొంది నన్నుజూచి సిగ్గుపడజొచ్చె. 'మా వుభయుల సుఖాంతము చెప్పుచున్నదో' యనునట్లు కిటికి చీకటు గ్రమ్మె. టవరుగడియార మపశకునముగ 7 గంటలుకొట్టె. అంత నాడామె పడసంత్రిప్పి పడ్డుంచేరె. అంతె నామె నావనుండి దిగుచూ బురదలోపడె. నేసహాయపడ ఆమె పడ్డుకొచ్చి అచ్చటనున్న మేకు కా పడవంగట్టె. గృహాభిముఖులమై స్టేషన్ వద్ద అతికష్టముపై వీడి నే తూర్పునకు ఆమె దక్షిణమునకు పోబోవ ముందు యెవ్వరో తుమ్మినట్లు వినికిడి.

అవి చెన్నపట్నమందలి కలరారోజులు. యేవీధిన చూచిననూ యేభాగమున చూచిననూ విచారదృశ్యములే. యెచ్చట వినిననూ మృత్యుదేవతా నాట్యధ్వనియే. ప్రజల కానందంబుగూర్చు సముద్రతీరము నిర్జనమైయుండి కాష్టమయమాయె. నగరమునందెచ్చట చూచిననూ భీభత్సము మెండుగానుండె. కాలకృత్యానంతరం వార్తలెరుంగగోరి పత్రికాపఠన మారంభించ అకాలమున అయాచితముగా నిద్రాదేవికి నాపై కరుణగలుగ నేనొక స్వప్నముం గాంచితి. 'నాప్రియురాలు విహారార్థమై సముద్రతీరమందలి షికారింట్లకొచ్చినట్లు నన్నుజూచి ఆమె నాకభిముఖియై రాదొడంగునంత నొకగ్రతాచు అకాలమృత్యువువోలె నామెం గరువ గమకించుచూ వెనుకరానే సదలింపనెంచు నంత నామె కాటం..' అయ్యో యని కలతమనస్సుతో తెలివొంది చూతునుగదా గదియందలి గవాక్షమునుండి వేడియైన సూర్యకిరణములు నాపై ప్రసరించుచుండె.

కొలదిసేపటికి కొక లేఖరా చదువదొడంగితి. అందులో నాప్రణయప్రతిమ యపాయమందున్నట్లు నాసాయ మపేక్షించినట్లు వ్రాయబడియుండె. నాహృదయమందామెను జూడవలెననెడి యాదుర్దా వాయువేగమునుమించి వేగిరపడదొడంగె. నేవెంటనే యామెయిచ్చిన విలాసమునకరిగి లోపలజూడ నెవ్వరో కలువరింపుచున్నట్లు హీనస్వరము వినంబడె. నాసహాయమూటగాగొని యావ్యక్తి శయనించిన మందిరద్వారము ప్రవేశించబోవునంత నాపై 'నాధా! ఆచిలుకాగోరువంకల సౌఖ్యము-యిన్-డేగ-పాపము వియోగి-చూడజాల' ననుచూ కనుదమ్ములు ముకుళించి శయనించియుండె. నేనామెశయ్యాంతరి నిర్జీవప్రతిమ

వోలె మూసుచూ అనుచేతడనై బాహ్యజ్ఞానశూన్యుడనైయుండ దాహమని కన్నులువిచ్చె. నేదాహమివ్వ నేదదీరి నావేదనాయుతవదన మీక్షించి యిస్ యనుచూ కండ్లుమూసి కనుదమ్ములనుండి సెలయేటి ప్రవాహమువలె బొటబొట కన్నీరుం గార్చదొడంగె. నేనూ అదేస్థితియందుండియూ, నామె చూచిన అబలానామము సార్థకపరచునని తలంచి, గంభీరించి నా కన్నీరు చేరుమాలచే వత్తుకొనుచూ నామె గార్చు ప్రవాహమున కడ్డువైచుచుంటి. మరల ఆమె కండ్లుతెరచిఁ వచ్చితిరానాథా, ధన్యురాల, సమయమున కొచ్చినందుల కభినందనములు. నే తమ వియోగము భరించజాలకయూ వ్యవహారము లొకదారి కొచ్చుటచే మొన్న బెంగుళూరునుంచి వచ్చితి. నా కారోజె కలరా తగులుటచే తమ సాన్నిధ్యమునకు రాజాలకపోయితి. ఇక నాకు జీవితాశలేదు. నా భావిసౌఖ్యమూ అలోచనలు ఆకాశహర్మ్యములైనవి. నాథా! ప్రియా! అబ్బా—యిస్—నా పెన్నిధీ! నేమరణించుటకు పూర్వము నాకు రెండు కోర్కెలుగలవు. అవితీర్చ ప్రార్థనగాన మనవివినుడు. అల్లదే నాయల్మరాతీయుడు. దానిలో కనబడు మా చిరపరిచితురాలైనపర్సునిండన నేనివ్వ నామె దానిం గన్నుల నద్దుకొని నన్ను సంభోధించి 'యే పర్సు మనకు రాయబారియై యింత స్నేహాభివృద్ధి చేసినదో—అప్పటినుంచి యేది నాకభిమానియై ప్రాణసమానమాయెనో ఆపర్సు నాప్రాణాధిక్యునకు—యమూల్యునకు—అపారప్రేమాస్పదునకు— నా ఈ ప్రేమ జ్ఞాపకచిహ్నంగా నీయదలంచి పిలిపించితి. ఇక రెండవకోర్కె నా యావదాస్తియూ నిన్న తమ పేరవ్రాసి రిజిష్టరుచేసితి. దాని యాదాయముచే ననాథల కాశ్రమము గల్పించుడు. ఎన్ని కష్టములొచ్చిననూ నాప్రేమస్మరించి వానినెల్ల జయించెదరను ధైర్యముచేతనూ తమయందుగల స్వతంత్రిము చేతనూ తమ యనుజ్ఞగోరకే చేసినపనికి క్షమించ ప్రార్థన. నా ఈమృతదేహ మా యాశ్రమమందు సమాధిపర్చకోరెద' యనుచూ పరసిచ్చి అతికష్టముపై నాతొడపై తనశిరస్సుంచి బాహులతచె నన్ను బెనవైచి నావదన మీక్షింపుచూ నయనద్వారముల నుండి హర్షబాష్పములు రాల్చుచూ యిహ లోక యాత్ర జాలించె.

ఆమె పల్కులు వినుచూ స్తబ్ధుడనై మేఘము గప్పిన చంద్రబింబమువలె నున్న యామె ముఖము వీక్షించుచుంటి. పిల్లియొకటి గదిలో ప్రవేశించి పాలగిన్నెంబడద్రోసె. వాకిట కావలికుక్క కుయ్యోమనె. గడియారము 2 గొట్టె, గాలికి గోడనున్న రాధాకృష్ణపటము క్రిందబడి భిన్నమాయె. ఈ శబ్దముచే బాహ్యజ్ఞానముకల్గి దైవవిధి—కృష్ణా నీలీలలనంతములుగదా' యనుచూ నాపె యాజ్ఞ పాలింప నిశ్చయించి కార్యక్రమ మారంభించితి.

౬

గిండీకిపోవుదారిలో నొక యనాథశరణాలయము సంఘసంస్కర్తయగు దేవధర్ గారిచే తెరువబడి ప్రస్తుత మైదువందలకుమించిన యనాథలకు కల్పతరువువోలెనుండె. అచ్చట హిందీ, సంస్కృతము, ఆంగ్లము గృహపరిశ్రమలు నేర్పబడుచుండె. నా యాశ్రమమందలి తయారుకాబడిన వస్తువులు ప్రదర్శనములం దగ్రస్థానమువహించి పతకముల బొందుచుండె. ఆశ్రమ బాలికల విద్యాప్రావీణ్యమునకు మెచ్చి ప్రభుత్వమువారు కొన్ని పతకములిచ్చి బహూకరించిరి. ఆపతకములచే కమలాసమాధిమందిరమున కెదురుగా కమలామందిర్ యని కూర్చబడె. వాని ప్రక్కనే అద్దపుపెట్టెలోబెట్టిన పర్సు తన ప్రభావముం దెల్పుచుండె. ఆశ్రమముఖద్వారమున కార్పొరెషన్ వారు తమ స్వంతకర్చుపై వివిధరంగుల విద్యుద్దీపములచే మోహన్ కమలామందిర్ యని కూర్చి ఆయాశ్రమమునకై వివిధ కష్టములకు లోనైననూ జంకక జయముగాంచిన మోహన్ రావు పేరుగూడ చేర్చి వారికి మోహన్ యందునూ అనాథలయందునూ గల యభిమానము వెల్లడించిరి.

త్యాగధనియై కీర్తిశేషురాలైన కమల మృతజీవియై యనాథలకు చిరస్మరణీయురాలుగదా?